
డా. అంబేడ్కర్ వెలుగులో



వివిధ సందర్భాలలో బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేడ్కర్ గారి ఆలోచనలు, వ్యక్తిత్వం, సమాజంపై ఆయన చూపిన ప్రభావం వంటి అంశాలపై నేను రాసిన వ్యాసాలన్నింటినీ ఒకచోట కూర్చి ఈ పుస్తకరూపంలో (PDF) అందిస్తున్నాను.

ఈ చిన్న ప్రయత్నం ఆ మహనీయుని మహత్తర దార్శనికతను, సమానత్వం—స్వేచ్ఛ—సౌభ్రాతృత్వం వంటి విలువలను మరొక్కసారి స్మరించుకొనే అవకాశం అని భావిస్తాను.

ఆయన చూపిన మార్గం నేటికీ ప్రాసంగికమే కాక, భవిష్యత్తుకూ దిశానిర్దేశం చేస్తుందని నా విశ్వాసం.

ఈ సందర్భంగా ఆ మహనీయునికి నా వినమ్ర నివాళులు అర్పిస్తూ---

భవదీయుడు
బొల్లోజు బాబా
14/4/2026

రాజ్యాంగ రచన -డా. అంబేద్కర్ మహాశయుడు.

భారతరాజ్యాంగ నిర్మాణంలో 299 మంది సభ్యులు పాల్గొన్నారని వారిలో డా. బి. ఆర్. అంబేద్కరు ఒకరని; నిజానికి రాజ్యాంగాన్ని 1947 లోనే బి.ఎన్. రావు రచించాడని దానినే డా. అంబేద్కర్ రాజ్యాంగ కమిటీ ముందు ప్రవేశపెట్టాడని; భారత రాజ్యాంగ నిర్మాతగా డా.అంబేద్కర్ పాత్ర పరిమితమని- అంటూ కొంతమంది సనాతనులు ప్రతి రిపబ్లిక్ డే రోజునా అబద్దాలను వండివార్చటం పరిపాటి.

***

రాజ్యాంగ సభ (Constituent Assembly) అంటే భారత రాజ్యాంగాన్ని తయారు చేయడానికి ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేకమైన సంస్థ. ఈ సభ భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు, 1946లో ఏర్పడింది. దీని ప్రధాన లక్ష్యం స్వతంత్ర భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించడం. ఈ సభ అధ్యక్షుడైన డా. రాజేంద్రప్రసాద్, భారత ప్రభుత్వ అధికారి, న్యాయకోవిదుడు బి.ఎన్ రావును రాజ్యాంగ ప్రాధమిక డ్రాఫ్ట్ ను/ముసాయిదా తయారు చెయ్యమని కోరాడు.

ఆ మేరకు బి.ఎన్. రావు వివిధ దేశాలు పర్యటించి, ఆ యా దేశాల రాజ్యాంగాలను పరిశీలించి వాటిలోని మంచి అంశాలను క్రోడీకరిస్తూ ఒక నివేదికను తయారు చేసి అక్టోబరు 1947 లో స్వతంత్రభారత ప్రభుత్వానికి సమర్పించాడు. (దీన్ని ఆర్చైవ్స్ లో Constitution in the making పేరుతో చదువుకొనవచ్చును) ఇది ఒకరకంగా రాజ్యాంగానికి ప్రాధమిక ఔట్ లైన్. ఇక్కడితో బిఎన్ రావు పాత్ర ముగిసిపోయింది. 1948 లో బి.ఎన్ రావు యునైటెడ్ నేషన్స్ లో భారత ప్రతినిధిగా, 1952 వరకు అంతర్జాతీయ

న్యాయస్థానంలో జడ్జ్ గా పని చేసారు. భారతదేశంలోనే లేరు. బి.ఎన్ రావు తయారు చేసిన నివేదిక ను రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ గా నియమించబడిన డా. అంబేద్కర్ కు ఇచ్చారు. దీనిని డా. అంబేద్కర్ దాదాపు తిరగ రాసి 299 మంది సభ్యులున్న Constituent Assembly ముందు చర్చించటానికి ప్రవేశపెట్టారు.

రాజ్యాంగాన్ని నిర్మించటం కొరకు జరిగిన చర్చలను Constituent Assembly Debates అంటారు. ఇవి డిశంబరు 9 1946 నుండి నవంబరు 26, 1949 మధ్య జరిగాయి.

.

బి.ఎన్ రావు ప్రతిపాదించిన రాజ్యాంగ ఫ్రేమ్ వర్క్ నివేదికకు (1947) డా. అంబేద్కర్ తుదిరూపు దిద్దిన (1950) రాజ్యాంగానికి గల వ్యత్యాసాలను ఈ విధంగా గుర్తించవచ్చు.

1. 240 ఆర్టికిల్స్ ను 390 ఆర్టికిల్స్ గా డా. అంబేద్కర్ విస్తరించారు.

2. ప్రజలమధ్య సోదరభావం సమైక్యత పెంపొందించటానికి రాజ్యాంగ ప్రవేశికలో సౌభ్రాతృత్వం అనే పదాన్ని డా. అంబేద్కర్ చేర్చారు

3. బిఎన్ రావు ప్రణాళిక 1935 నాటి భారతప్రభుత్వ చట్టాలపై ఎక్కువగా ఆధారపడింది. డా. అంబేద్కర్ రాష్ట్రాలు, కేంద్రాల అధికారాలను, పరిధులను స్పష్టంగా నిర్వచించారు. కేంద్రం బలంగా ఉండేందుకు అనేక మార్పులు చేసారు. అత్యవసర సమయంలో దేశంలో ప్రాధమిక హక్కులు రద్దుచేసి ఎమర్జెన్సీ విధించే హక్కు కేంద్రానికి కల్పించారు.

4. బిఎన్ రావు ప్రణాళికలో ప్రాథమిక హక్కులు పరిమితంగా ప్రస్తావించబడ్డాయి. డా.అంబేద్కర్ తుది రాజ్యాంగం వాటిని విస్తరించి పునర్నిర్మించింది, ముఖ్యంగా వివక్షకు వ్యతిరేకంగా రక్షణలు కల్పించింది. అంటరానితనాన్ని రద్దు చేసింది. ప్రాధమిక హక్కుల పునరుద్ధరణ కొరకు ఏ

పౌరుడైనా సుప్రీమ్ కోర్టు తలుపు తట్టటం అనే గొప్ప అవకాశాన్ని ఇచ్చింది. (ఆర్టికిల్ 32) దీన్ని రాజ్యాంగం యొక్క హార్ట్ అండ్ సోల్ అని డా. అంబేద్కర్ వర్ణించారు.

5. డా. అంబేద్కర్ న్యాయవ్యవస్థను స్వతంత్రంగా నిలబెట్టారు. ప్రజల ప్రాథమిక హక్కులను రక్షించటానికి దానికి విస్తృతమైన అధికారాలను ఇచ్చారు.

6. బిఎన్ రావు ప్రణాళికలో పెద్దల ఓటు హక్కు లేదా ఎన్నికల ప్రక్రియలను స్పష్టంగా నిర్వచించలేదు. అంబేద్కర్ బృందం సార్వత్రిక పెద్దల ఓటు హక్కు మరియు ఎన్నికల యంత్రాంగాల కోసం ఒక బలమైన స్వతంత్ర వ్యవస్థను ప్రతిపాదించింది.

7. బిఎన్ రావు ప్రణాళిక భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు స్పష్టమైన నిబంధనలను రూపొందించలేదు. అంబేద్కర్ ఆధ్వర్యంలోని తుది రాజ్యాంగం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు ఆవశ్యతను, అవకాశాలను గుర్తించింది.

8. ఆర్టికిల్ 39 ద్వారా సమానపనికి సమాన వేతనచట్టాన్ని మరింత విస్తృతపరచారు డా. అంబేడ్కర్. అదే విధంగా ఆర్టికిల్ 45 ద్వారా 14 ఏళ్ళ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పటం రాష్ట్రాల బాధ్యత చేసారు.

9. బిఎన్ రావు ప్రణాళికలో వెనుకబడిన వర్గాలకు రక్షణ కల్పించమని ఉంది. దీన్ని డా.అంబేద్కర్ మరింత విస్తరించి ఎస్సి, ఎస్టీ లకు విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించారు.

10. అత్యయిక పరిస్థితులలో దేశం ఏం చెయ్యాలనేది బి.ఎన్ రావు ప్రణాళికలో సూచించలేదు. దీన్ని 352, 356, 360 లాంటి ఆర్టికిల్స్ ద్వారా కేంద్రం దేశాన్ని కంట్రోల్ లోకి తీసుకొని యుద్ధం, అంతర్గతకల్లోలాలు వంటి అత్యయిక పరిస్థితులను సరిదిద్దే అవకాశం కల్పించారు డా. అంబేద్కర్

11. రాజ్యాంగ సభ ఈ ముసాయిదాను సుమారు మూడేళ్ళపాటు చర్చలు జరిపి తుది రాజ్యాంగాన్ని ఆమోదించింది. దాదాపు ఈ చర్చలన్నిటిలో డా. అంబేద్కర్ పాల్గొన్నారు. సభ్యుల సందేహాలకు వివరణలు ఇచ్చారు. అభ్యంతరాలు చెప్పిన చోట వేల కొలదీ తగిన సవరణలు చేసి ఒప్పించారు. ఆ విధంగా రాజ్యాంగ తుది రూపం డా.అంబేద్కర్ మేధో శ్రమఫలితమే.

పై అంశాలను గమనిస్తే- ఈ రోజు ఏదైతే మనం రాజ్యాంగ మౌలిక స్వరూపం అని అనుకొంటున్నామో దానిని డా. అంబేద్కర్ రూపొందించినట్లు అర్ధమౌతుంది. ఇది సామాన్యపౌరుడిని వివక్ష, దోపిడి, దౌర్జన్యాలనుండి నుండి రక్షిస్తుంది. ఈ రోజు ఈ హక్కులను కాలరాయటం జరుగుతోంది. రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించటం కూడా పైన పొందుపరచిన అంశాలను తొలగించటానికే అని అనుమానించే పరిస్థితులు ఉన్నాయి.
***

రాజ్యాంగ సభ 165 సార్లు కూర్చుని రాజ్యాంగం ఎలా ఉండాలో చర్చించింది. అనారోగ్యంతో ఉండికూడా వీటిలో సుమారు 150 సమావేశాలకు డా.అంబేద్కర్ హాజరయ్యారు. తుది మెరుగుల కొరకు ముసాయిదాను మూడుసార్లు సభ్యుల ముందు ప్రవేశపెట్టారు. రాజ్యాంగ సభ సభ్యులు మొత్తం 7635 మార్పులు సూచించగా 2473 మార్పులను డా. అంబేద్కర్ అంగీకరించి తదనుగుణంగా సవరణలు చేసారు. తిరస్కరించిన సూచనలకు, చేసిన మార్పులకు స్వయంగా సమాధానం ఇచ్చారు.

ఈ Constituent Assembly చర్చలన్నీ నేడు 6756 పేజీల డాక్యుమెంటుగా లభిస్తున్నాయి. ఈ డాక్యుమెంటులో డా. అంబేద్కర్ పేరు 4524 సార్లు రాగా బి.ఎన్ రావు పేరు 35 సార్లు మాత్రమే ఉండటాన్ని బట్టి డా. అంబేద్కర్ రాజ్యాంగ రచనలో పోషించిన పాత్ర స్పష్టమౌతుంది. రాజ్యాంగ సభలో డా. అంబేద్కర్ రోజూ 9-10 సార్లు లేచి నిలబడి తన అభిప్రాయాలను సమర్ధించుకోవటమో లేక సమాధానం ఇవ్వటమో చేసారని, కొన్ని సార్లు రోజుకు 25-26 సార్లు కూడా సభలో తన గళాన్ని వినిపించేవారని

ఈ Constituent Assembly చర్చల ద్వారా అర్ధమౌతుంది. తుది రాజ్యాంగ ప్రతి 1949 లో కమిటీ సభ్యుల ఆమోదం పొంది జనవరి 26, 1950 నుంచి అమలులోకి వచ్చింది. రాజ్యాంగ నిర్మాణదశ, దాన్ని ఆమోదించటంలో రాజకీయంగా డా. అంబేద్కర్ కు జవహర్ లాల్ నెహ్రూ ఇచ్చిన మద్దతును విస్మరించలేం.

***

రాజ్యాంగ రచనలో పాల్గొన్న 299 మంది సభ్యులలో డా. అంబేద్కర్ ఒకరని, రాజ్యాంగాన్ని బి.ఎన్ రావు రూపొందించగా డా. అంబేద్కర్ క్రెడిట్ తీసుకొన్నారని సనాతనులు దుష్ప్రచారం చేస్తారు.

రాజ్యాంగ సభ సభ్యులలో ఒకరైన టీ.టీ. కృష్ణమాచారి, ఒక సమావేశంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యొక్క అంకితభావం గురించి మాట్లాడుతూ ---"రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీకి ఎంపిక చేసిన ఏడుగురు సభ్యులలో ఒకరు రాజీనామా చేశారు, ఒకరు మరణించారు, ఒకరు అమెరికాకు వెళ్ళారు, ఒకరు స్వరాష్ట్రంలో తన పనితో బిజీగా ఉన్నారు, ఇద్దరు ఢిల్లీ నుండి దూరంగా నివసిస్తున్నారు, మరొకరు ఆరోగ్య కారణాల వల్ల మినహాయించబడ్డారు, డాక్టర్ అంబేద్కర్ ఒక్కరే భారాన్ని మోయవలసి వచ్చింది" అని అన్నారు.

డా.అంబేడ్కర్ సమకాలీనుడు, రాజ్యాంగరచనలో పాల్గొన్న ఒక వ్యక్తి అన్నమాటలు. ఇవేవీ ఈ సనాతనులకు కనిపించవు.

నేడు వీరు డా. అంబేద్కర్ కృషిని తగ్గించాలని చూడటానికి కారణాలు - డా.అంబేడ్కర్ ప్రాచీన ధర్మశాస్త్రాలకు విరుద్ధంగా, ప్రజలందరకూ సమాన హక్కులు, విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించటం మరీ ముఖ్యంగా ఈ దేశాన్ని హిందూరాజ్యంగా కాక స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూడు ప్రాధమిక సూత్రాలకు అనుగుణంగా నిర్మించు కొనేందుకు ఒక బలమైన రాజ్యాంగాన్ని ఇవ్వటం, అది సామాన్యులు, నిరుపేదల పట్ల పక్షపాతంతో ఉండటం. వీటిని జీర్ణించుకోలేక సనాతనులు నిత్యం ఈ శతాబ్దపు దార్శనికుడిపై బురద జల్లుతున్నారు.

January 28, 2025

డా. అంబేద్కర్ ఎందుకు రాజీనామా చేశారు?

భారతదేశాన్ని లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దటంలో నెహ్రూ, డా. అంబేద్కర్ లు పరస్పరం సహకరించుకొంటూ పోషించిన పాత్ర అనన్యసామాన్యమైనది. డా. అంబేద్కర్ కు రాజకీయపరంగా నెహ్రూ ఇచ్చిన మద్దతుతో గొప్ప ఆధునిక విలువలు కలిగిన రాజ్యాంగం రూపుదిద్దుకొంది. డా. అంబేద్కర్,పండిత నెహ్రూల సంస్కరణాభిలాషకు హిందూకోడ్ బిల్ అద్దం పడుతుంది. మతవాదులు ఈ బిల్లును తీవ్రంగా అడ్డుకొన్నారు. ఈ మతవాదుల దూకుడుకు నెహ్రూ కూడా రాజకీయంగా కొంత తగ్గవలసి వచ్చింది. 1949 నుంచి దాదాపు రెండేళ్లపాటు పార్లమెంటులో హిందూకోడ్ బిల్లుపై చర్చలు జరిగాయి. కొలిక్కి రాలేదు.

ఈ బిల్లును పార్లమెంటులో డా. రాజేంద్ర ప్రసాద్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జి, పట్టాభి సీతారామయ్య పండిత్ గోవింద మాలవ్య, బిహారీలాల్ భార్గవ, దుర్భంగా మహరాజా లాంటి వారు వ్యతిరేకించారు. పార్లమెంటు వెలుపల హిందూ మతగురువులు, ధార్మిక నాయకులు ఈ బిల్లును తీవ్రంగా తూర్పారపట్టారు.

వీరందరి వాదన ఒకటే – ఈ బిల్లు హిందూ ధర్మశాస్త్రాలపై ఆధారపడి లేదని, పాశ్చాత్యప్రభావంతో కూడిన చట్టం అని, ఇది మన సంస్కృతిని సంప్రదాయాలను మార్చటానికి ప్రయత్నిస్తున్నదని. వేల సంవత్సరాలుగా కాలపరీక్షకు తట్టుకొని నిలబడ్డ హిందూ సామాజిక ఆచారవ్యవహారాలకు ఈ బిల్లులోని అంశాలు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. అంతేకాక మతవిషయాలపై పార్లమెంటుకు చట్టాలు చేసే యోగ్యత లేదని మతవాదులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసారు.

ఈ బిల్లుపై చర్చ జరుగుతున్న సందర్భంలో- డిశంబరు 11, 1949 న వెయ్యిమంది సనాతనవాదులు పండిత గోవింద మాలవ్య నాయకత్వంలో పార్లమెంటును ముట్టడించారు. (ఆంధ్రపత్రిక డిశంబరు 13, 1949)

ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపి పునఃపరిశీలన చేయటానికి డిశంబరు 19, 1949 న పార్లమెంటులో జరిగిన ఓటింగులో పదకొండు మంది మాత్రమే బిల్లుకు అనుకూలంగా ఓట్ చేయటాన్ని బట్టి హిందూ కోడ్ బిల్లు ఏ మేరకు సనాతనులనుండి ప్రతిఘటనను ఎదుర్కొందో అర్ధం చేసుకొనవచ్చును. (ఆంధ్రపత్రిక డిశంబరు 20, 1949)

సెలక్ట్ కమిటీ రెండేళ్ళ పాటు పరిశీలించిన అనంతరం కూడా హిందూ కోడ్ బిల్ పార్లమెంటులో ఆమోదం పొందలేదు.

హిందూ కోడ్ బిల్ ఆమోదం పొందనందుకు డా. అంబేద్కర్ సెప్టెంబరు 27, 1951 న లా మినిస్టర్ గా రాజీనామా చేసారు. తన రాజీనామా లేఖలో "పార్లమెంటు ప్రస్తుత సమావేశాలలోనే హిందూ న్యాయశాస్త్ర సవరణ బిల్లు నెగ్గవచ్చుననే నమ్మకంతో ఇంతవరకూ పనిచేసానని, ఆ ఉద్దేశంతోనే బిల్లులోనుంచి "వివాహం విడాకులు" భాగాన్ని ప్రత్యేకించటానికి కూడా అంగీకరించానని, ఇప్పుడు ప్రభుత్వము దానిని పూర్తిగా చంపివేసినందున రాజీనామా చేస్తున్నానని" డా. అంబేద్కర్ తెలియచేసారు. (ఈ లేఖలో డా. అంబేద్కర్ ప్రభుత్వ ఇతరవిధానాలతో తాను వ్యతిరేకిస్తున్నట్లు ఎక్కడా చెప్పి ఉండలేదు. - అక్టోబరు 13 1951 ఆంధ్ర పత్రిక)

పండిత నెహ్రూ ఈ లేఖకు ఆరోజే జవాబిస్తూ "హిందూ న్యాయసవరణ బిల్లు ఉపసంహరించబడి నందుకు డా. అంబేద్కర్ పొందిన ఆశాభంగాన్ని తాను గుర్తించినట్లూ, అయితే విధీ, పార్లమెంటు నియమాలూ తమకు ప్రతికూలించినట్లు, ఆ బిల్లు నెగ్గనిదే నిజమైన అభివృద్ధి ఉండదు కనుక దానికోసం ఇంకా తాను పాటు పడబోతున్నట్లూ తెలియచేసాడు.

హిందూ మహాసభ, జన సంఘ్, రామ రాజ్య పరిషద్ లాంటి మతవాద పార్టీలు ఈ బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేయగా, కాంగ్రెస్ లోని కొందరు మతవాదులు కూడా వారితో జతకలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడైన పట్టాభిసీతారామయ్య "ఈ బిల్లు విషయంలో జాగ్రత్తగా నడవకపోయినట్లయితే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ దెబ్బతింటుంది" అని నెహ్రూను హెచ్చరించాడు. ఇలాంటి తీవ్ర ప్రతికూలతల మధ్య బిల్లును ఆమోదింపచేయటం పండిత నెహ్రూ చేతిలో కూడా ఉండకపోవచ్చు. ఈ పరిణామాలు డా.అంబేద్కర్‌ను తీవ్రంగా నిరాశపర్చాయి.

హిందూ కోడ్ బిల్ లో ఏముంది?

హిందూ సమాజంలోని కుటుంబ, వివాహం, వారసత్వం వంటి వ్యక్తిగత చట్టాలను క్రోడీకరించి ప్రవేశపెట్టిన ఒక సమిష్టి చట్టాల సముదాయాన్ని హిందూ కోడ్ బిల్ అంటారు. హిందూకోడ్ బిల్ ఒక విప్లవాత్మక చట్టం. హిందూ కుటుంబం, వివాహం లాంటి అంశాలు ఎలా ఉండాలనేది హిందూ ధర్మ శాస్త్రాలు ఏనాడో నిర్ణయించాయి. కానీ వాటిలో స్త్రీ పురుషుల మధ్య సమానత్వం, స్వేచ్ఛ ఉండదు. లింగ, కుల వివక్షలు ఉంటాయి. వాటిని తొలగించి మానవ సంబంధాలను ఆధునిక భావనలకు అనుగుణంగా నిర్వచించి, హిందూ సమాజాన్ని స్వేచ్ఛ, సమానత్వాలకు సిద్ధం చేయటం హిందూకోడ్ బిల్ ముఖ్య ఉద్దేశం.

ఈ బిల్లును సంప్రదాయ మత వాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. హిందూ ధర్మశాస్త్రాలు నిర్ధేశించినట్లు హిందువులు జీవిస్తారని; ధార్మిక విషయాలలో చట్టాలు చేసే హక్కు పార్లమెంటుకు లేదని అంటూ ఆందోళనలు చేసి హిందూ బిల్ ను అడ్డుకొన్నారు.

హిందూ బిల్ లో ప్రతిపాదించిన అంశాలను గమనిస్తే, డా. అంబేద్కర్ ఎంతటి దార్శనికత కలిగిన మనిషో, ధర్మశాస్త్రాల నిర్ధేశించినట్లుగా హిందూ కుటుంబం

నడుచుకోవాలి అంటూ మతవాదుల ఎంతటి మూర్ఖపు వాదన చేసారో అర్ధమౌతుంది.

హిందూ కోడ్ బిల్---

1.బాల్యవివాహాలను నిషేదించింది. వివాహవయస్సు నిర్ణయించి, వధూవరుల పరస్పర అంగీకారంతో వివాహం జరగాలని చెప్పింది.

2.కులాంతర, మతాంతర వివాహాలను అనుమతించింది

3.స్త్రీలకు దత్తత తీసుకొనే హక్కు కల్పించింది

4.స్త్రీలకు విడాకులు ఇచ్చే హక్కు కల్పించబడింది. (ఈ క్లాజుకి భారతీయ సమాజం కుప్పకూలిపోతుందని పార్లమెంటులో మతవాదులు గగ్గోలు పెట్టారు)

5.విడాకులు తీసుకొన్న మహిళ జీవన బృతిగా మనోవర్తిపొందే హక్కు కల్పించింది

6.బహుబార్యత్వాన్ని నిషేదించింది

7.కుమార్తెలకు, కుమారులతో సమానంగా తండ్రి ఆస్తిలో హక్కు కల్పించింది. పెద్ద కొడుకుకు మాత్రమే ఆస్తిలో హక్కు కలిగి ఉండే ఆచారాన్ని నిషేదించింది.

8.స్త్రీలు ఆస్తిని కొనుగోలు చేసే హక్కు కల్పించింది

9.తండ్రితో సమానంగా పిల్లలకు తల్లి సహజ సంరక్షకురాలిగా ఉండే హక్కు కల్పించింది

10 స్త్రీలకు సమాన హక్కులు కల్పించబడ్డాయి

పైన చెప్పిన అంశాలన్నీ స్త్రీ స్వేచ్ఛ, సాధికారికతకు సంబంధించిన అంశాలు. భారతదేశం రెండువేల సంవత్సరాలుగా పాటించిన సామాజిక విలువలకు ఇవి పూర్తిగాభిన్నమైనవి, కొత్తవి.

ధర్మశాస్త్రాలలో బాల్య వివాహాలు ఉంటాయి. కులాంతర వివాహాలు చేసుకోరాదు. స్త్రీలకు తండ్రి ఇచ్చిన స్త్రీధనంపై హక్కులు తప్ప మరే విధమైన ఆస్తి హక్కులు లేవు. భర్త దేశాంతరాలు పట్టిపోయినా, నపుంసకుడైనా విడాకులు కోరవచ్చు తప్ప మరే ఇతరకారణాలతో కాదు. మనోవర్తి లేదు. బహుభార్యత్వం ఉంది. పెద్దభార్య పెద్ద కొడుకే ఆస్తికి వారసుడు. స్త్రీపురుషులు సమానులు కాదు. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, ముసలితనంలో కుమారుని సంరక్షణలో ఉండాలని స్త్రీకి స్వాతంత్రం లేదని మనుధర్మశాస్త్రం చెప్పింది.

ధర్మశాస్త్రాలలో చెప్పిన అంశాలు భారతీయ సంస్కృతి అని, వాటిని రాజ్యాంగంలో పొందుపరచాలని మతవాదులు పోరాడారు. ప్రజాస్వామిక లక్షణాలతో ఉన్న హిందూకోడ్ బిల్ ను వ్యతిరేకించారు. బిల్లును పార్లమెంటులో ఓడించారు. లౌకిక ప్రజాస్వామిక విలువలు కలిగిన దేశాన్ని నిర్మించాలని కలలు కన్న డా. అంబేద్కర్ ను తీవ్ర నిరాశకు గురిచేశారు. నిరసనగా డా. అంబేద్కర్ లా మంత్రిగా రాజీనామా చేసారు. స్వతంత్ర భారతదేశంలో ఒక అంశాన్ని విభేదిస్తూ చేసిన మొట్టమొదటి రాజీనామా ఇది.

ముగింపు

ఆ తదనంతరం 1955-56 మధ్య ఈ బిల్లును- the Hindu Marriage Act, Hindu Succession Act, Hindu Minority and Guardianship Act, and Hindu Adoption and Maintenance Act అనే పేర్లతో దఫదఫాలుగా చట్టాలుగా చేయటం జరిగింది. నేడు భారతీయ మహిళ స్వేచ్ఛగా, సాధికారంగా జీవనం సాగిస్తున్నదంటే డా. అంబేద్కర్ రూపొందించిన హిందూ కోడ్ బిల్ మరియు దాన్ని సాకారం చేసిన పండిత నెహ్రూ దృఢ సంకల్పమే కారణం.

****

రాజ్యాంగం ఆర్టికల్ 44 లో ప్రజలందరకూ ఒకటే వ్యక్తిగత చట్టాలు అమలుకావాలంటే యూనిఫార్మ్ సివిల్ కోడ్ (UCC) తీసుకురావలసి ఉంటుందని రాసుకున్నాం. భారతదేశం వైవిధ్యభరితమైనదని మైనారిటీలకు

సంబంధించి వారు కోరుకుంటే UCC లోకి రావచ్చని పండిత నెహ్రూ అప్పట్లో వ్యాఖ్యానించారు.

UCC తీసుకొస్తే ముస్లిములకు ఉండే నాలుగు పెళ్ళిళ్ళు చేసుకోవటం, 16 ఏళ్ళకే వివాహ వయస్సు లాంటి హక్కులను కోల్పోతారు. ట్రిపుల్ తలాక్ హక్కు ఇప్పటికే తొలగించారు. ముస్లిమ్ సమాజాన్ని ఏదో చేసేయ్యాలని హిందుత్వవాదులు UCC తీసుకొస్తామని పదే పదే ప్రకటనలు చేస్తుంటారు.

నిజానికి UCC వల్ల హిందూ సమాజం కూడా గణనీయంగానే ప్రభావితమౌతుంది. హిందూ కోడ్ బిల్ భారతదేశపు హిందువులలో ఉండే భిన్నత్వాన్ని గౌరవిస్తుంది. UCC వస్తే సిక్కులు కృపాణం ధరించటం, కొన్ని చోట్ల గిరిజనులు ప్రత్యేక వివాహ చట్టాలను కలిగి ఉండటం, హిందూ ఉమ్మడికుటుంబం పేరిట పొందే ప్రత్యేక టాక్సు మినహాయింపులు వారసత్వ హక్కులు, గోవా లాంటి ప్రాంతాలలో హిందువులు పొందే కొన్ని ప్రివిలేజస్, ఉత్తరాఖాండ్ లాంటి చోట హిందువులు పాటించే విభిన్నమైన ఆచారాలు లాంటివి కోల్పోవలసి ఉంటుంది.

ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని 2018 లో లా కమిషన్, గొప్ప సాంస్కృతిక వైవిధ్యం కలిగిన భారత దేశంలో UCC సాధ్యంకాదు వాంఛనీయం అసలే కాదు అని రిపోర్ట్ ఇచ్చింది.

హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లు

సనాతనుల ప్రతిఘటన

కాశి, డిసెంబరు 12: హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకొనవలెనని కోరు తీర్మానమునొక దానిని పూర్వాచారపరాయణులగు పండితుల సభవారు నేడు గావించిరి. లౌకిక రాజ్యము అన్ని మతములవారిని సమముగా జూడవలెనని, ఎవ్వరి మత విషయములలోను జోక్యము కలిగించుకొనగూడదని తీర్మానము తెలిపెను.

గోవర్ధన పీఠాధిపతులగు శ్రీ శంకరాచార్యులవారు, శ్రీమతి ప్రభావతీదేవి (దేవాస్ మహారాజా గారి కుమార్తె) ఇంకా చాలామంది పండితులు ఉపన్యసించుచు ప్రస్తుత రాజ్యాంగ పరిషత్ సభ్యులకు మత విషయములపై అభిప్రాయము చెప్పు యోగ్యత లేదనిరి. రాజకీయ వ్యవహారములను నిర్వర్తించుటకు ప్రజలు వారిని ఎన్నుకొనిరనిరి ప్రభుత్వమువారు బిల్లును ఉపసంహరించుకొనవలెనని కోరిరి.

సెప్టెంబర్ 27న డా॥ అంబేద్కర్ రాజీనామా లేఖను నెహ్రూకు పంపారు. తాను మంత్రిపదవిని వదిలిపెట్టి వెళ్ళాలని చాలా కాలం నుంచి అనుకుంటున్నాననీ, అయితే పార్లమెంటు ప్రస్తుత సమావేశంలోనే హిందూ న్యాయశాస్త్ర సవరణబిల్లు నెగ్గవచ్చునన్న నమ్మకంతో ఇంతవరకూ పని చేశాననీ, ఆ ఉద్దేశంతోనే బిల్లులోనుంచి 'వివాహం విడాకులు' భాగాన్ని ప్రత్యేకించటానికి కూడా అంగీకరించాననీ, ఇప్పుడు ప్రభుత్వము దానిని పూర్తిగా చంపివేసినందువల్ల రాజీనామా చేస్తున్నాననీ తెలియజేశారు.

పండిత నెహ్రూ ఆరోజునే దానికి సమాధానం ఇస్తూ, హిందూ న్యాయశాస్త్ర సవరణ బిల్లు ఉపసంహరించబడినందుకు డా॥ అంబేద్కర్ పొందిన ఆశాభంగాన్ని తాను గుర్తించినట్లూ, అయితే విధీ, పార్లమెంటు నియమాలూ తమకు ప్రతికూలించినట్లు, ఆ బిల్లు నెగ్గనిదే నిజమైన అభివృద్ధి ఉండదు గనుక దానికోసం ఇంకా తాను పాటుపడబోతున్నట్లూ తెలియజేశారు (ఈ లేఖల్లో అంబేద్కర్ గారు ప్రభుత్వ ఇతర విధానాలలో తాను ఏకీభవించలేకపోయినట్లు ఎక్కడా చెప్పి ఉండలేదు.)

రాజ్యాంగ దినోత్సవం రోజున......

రాజ్యాంగ దినోత్సవం రోజున ఒక మిత్రుని మాటలలో రెండు ఆసక్తికర విషయాలు దొర్లాయి. వీటిని చాలా కాజువల్ గా రిమార్క్ చేసాడు.

1. డా. అంబేద్కర్ విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 10 ఏళ్లకే పరిమితం చేసారు. ఆ తరువాత పాలకులు దానిని స్వప్రయోజనాలకొరకు పెంచుకొంటూ వస్తున్నారు

2. డా.అంబేద్కర్ విభజనానంతరం భారతదేశంలో ఉండిపోయిన ముస్లిములను వారికి ఇచ్చిన దేశానికి వెళిపొమ్మని అన్నారు.

చాలా సాధారణ అంశాలలాగ కనిపించే పై విషయాల వెనుక బహుముఖాలతో లోతైన ద్వేషం, అసూయ, విషం ఉన్నాయని ఇట్టే అర్ధమైపోతుంది.

వివరణ:
రాజ్యాంగం పొలిటికల్ రిజర్వేషన్లకు మాత్రమే 10 ఏళ్ళ పరిమితి విధించింది. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లకు ఏ రకమైన పరిమితులు విధించలేదు. డా. అంబేద్కర్ విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు పదేళ్లకు మాత్రమే ఇచ్చారు అని చెప్పటం వక్రీకరణ.

1932 పూనా ఒడంబడిక ద్వారా దళితులు మాత్రమే పోటీ చేసే Reserved Constituency లు ఏర్పరచారు.
దళితులకు Reserved Constituency ల ద్వారా అప్పటివరకూ ఇస్తున్న పొలిటికల్ రిజర్వేషన్లు కొనసాగించాలా వద్దా అనే అంశం మరలా రాజ్యాంగ

పరిషత్ చర్చలలో వచ్చింది. (constituent assembly debates). ఆనాటి మేధావులు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి....

1. ఈ దేశంలోని ప్రతి దళితుడుకి పది ఎకరాల భూమి ఇచ్చి ఈ పొలిటికల్ రిజర్వేషన్లను తీసివేయడానికి నాకు అభ్యంతరం లేదు - S. Nagappa (Madras) పే: 3214

2. మీరు మాకు పదేళ్లపాటు పొలిటికల్ రిజర్వేషన్లు ఇచ్చి మీకు చేయాల్సిందంతా చేసామని చేతులు దులుపుకుంటే కుదరదు. మమ్మలను విద్యాపరంగా, ఆర్ధికంగా పైకి తీసుకురావడానికి మీవద్ద ఏ ప్రణాళికలు ఉన్నాయో కూడా చెప్పండి. -- Shri H.J. Khandekar, పే:4589)

3. పొలిటికల్ రిజర్వేషన్లు పది సంవత్సరాల పాటు అనేది చాలా తక్కువ వ్యవధి -- Shri Chandrika Ram పే 4609.

4. దళితులకు పొలిటికల్ రిజర్వేషన్లు కల్పించటం మనం వారికి చేయగలిగే అత్యుత్తమ పని – జవహర్ లాల్ నెహ్రూ పే. 3216

5. “పదేళ్ళ వరకు" అనే పదం తరువాత “అవసరమైతే మరికొంతకాలం పొడిగించవచ్చు” అనే వాక్యాన్ని ప్రవేశపెట్టండి భవిష్యత్తులో పార్లమెంటుకు ఆమేరకు వెసులుబాటు ఉండే విధంగా. (Shri V.I. Muniswamy Pillay) పే 4600

6. పొలిటికల్ రిజర్వేషన్లను సంపూర్ణంగా రద్దు పరచాలి. కులమతాలకు అతీతంగా ఎన్నికలు జరగాలి-- Prof. Shibban Lal Saksena, పే2789

పొలిటికల్ రిజర్వేషన్లకు పరిమితి విధించినట్లుగానే విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లకు కూడా పదేళ్ల తరువాత కొనసాగించకూడదని Pandit Hirday Nath Kunzru ఒక సవరణను ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదనను రాజ్యాంగ

సభ తిరస్కరించింది. పే 2123. అలా పదేళ్ల పరిమితి అనేది పొలిటికల్ రిజర్వేషన్ల కొరకే తప్ప , విద్యా ఉద్యోగాల కొరకు కాదు అని రాజ్యాంగ సభ తీర్మానించింది.
డా. అంబేద్కర్ ఎక్కడా విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు పదేళ్ళ వరకే ఉండాలని చెప్పకపోయినా అలా చెప్పారని అనటం విష ప్రచారం.

దళిత ఆదివాసిలకు ఇస్తున్న పొలిటికల్ రిజర్వేషన్ల వలన ప్రస్తుత పార్లమెంటులో - 84 మంది ఎస్సీ ఎంపీలు (16%), 47 ఎస్టీ ఎంపీ (9%) లతో వారి రాజకీయ ప్రాతినిధ్యం వారి జనాభాతో సరిపోతుంది. ఇది పొలిటికల్ రిజర్వేషన్లు సాధించిన ప్రగతి. ఇవే లేకుంటే- ఈ సంఖ్యలు అసంభవం. బహుజనుల పొలిటికల్ రిజర్వేషన్లు ఏనాటికైన గమ్యం కావాలి. ఇక స్వాతంత్రపూర్వం ముస్లిములకు కూడా పొలిటికల్ రిజర్వేషన్లు ఉండేవి. (ముస్లిములు మాత్రమే తమ ప్రతినిధులను ఎన్నుకొనే కొన్ని నియోజకవర్గాలు). స్వాతంత్రం వచ్చాక అవి తొలగించారు.

దేశజనాభాలో దాదాపు 15% జనాభా ఉన్న ముస్లిముల ప్రాతినిధ్యం నేటి పార్లమెంటులో 24 మంది. ఇది 4.4% మాత్రమే. అంటే ప్రస్తుత పార్లమెంటులో జనాభాప్రకారం 77 మంది ఎంపీల ప్రాతినిధ్యం ఉండాల్సిన ముస్లిమ్ ఎంపీలు 24 మంది మాత్రమే ఉండటానికి కారణం వారికి తొలగించబడిన పొలిటికల్ రిజర్వేషన్ లు కారణం కావొచ్చు.
***

Pakistan or Partition of India (1947) పుస్తకంలో డా. అంబేద్కర్ ఆనాటికి సామాజిక ఆర్ధిక రాజకీయ అంశాలను చర్చిస్తూ దేశవిభజన పట్ల తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. దీనిలో డా. అంబేద్కర్ హిందూ ముస్లిమ్ మతరాజకీయాలను నిరసించారు. అవి అలాగే కొనసాగితే హిందూ ముస్లిములు ఒక దేశంగా జీవించలేరని దేశవిభజన అనివార్యం అని అభిప్రాయపడ్డారు.

మతప్రాతిపదికన దేశ విభజనకు, ద్విజాతి సిద్ధాంతానికి మద్దతు ఇవ్వలేదు. దేశం ఒకటిగా ఉండాలని కోరుకున్నారు.

దేశ విభజన పర్యవసానాలైన – భారీ వలసలు, హింస, లక్షల ముస్లిములు కాందిశీకులుగా మారిపోవటం గురించి ఈ పుస్తకంలో చర్చించారు తప్ప విభజన జరిగితే ఇక్కడి ముస్లిములందరూ వారికివ్వబడిన దేశానికి వెళ్ళిపోవాలని ఎక్కడా అనలేదు. పార్టిషన్ పై డా. అంబేడ్కర్ ది శాస్త్రీయ విశ్లేషణ.

విభజనానంతరం ఇక్కడ ఉండిపోయిన ముస్లిముల పట్ల డా. అంబేడ్కర్ సహానుభూతితో వ్యవహరించారు. రాజ్యాంగంలో- ఇస్లామిక్ పర్సనల్ లా, ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపుని, విద్యా వ్యవస్థను కాపాడుకొనే హక్కు, మైనారిటీ హక్కులు, మెజారిటేరియన్ మత ఆధిపత్యం నుండి రక్షణ, మతస్వేచ్ఛ లాంటి రక్షణలను ఆర్టికిల్స్ 25–30 లలో పొందుపరచారు. ఇవన్నీ డా. అంబేడ్కర్ ముస్లిములను తన సహోదరులగా భావించి కల్పించిన రాజ్యాంగ హక్కులు. డా. అంబేద్కర్ ఈ దేశ ముస్లిములను విభజన పూర్వం కానీ, అనంతరంకానీ ఈ దేశాన్ని విడిచిపెట్టి వెళ్లమని అనలేదు. అది వక్రీకరణ.

పోస్ట్ స్క్రిప్ట్.

శ్రీ Srinivas Vuruputuri గారి తో జరిపిన చర్చలో ఈ అంశంపై మరికొన్ని చేర్పులు ఇవి.....

డా. అంబేడ్కర్ జిన్నా, సావార్కర్ లాంటి భావజాలంతో దేశ విభజనకు, ద్విజాతి సిద్ధాంతానికి మద్దతు ఇవ్వలేదు. డా. అంబేడ్కర్ Pakistan or the Partition of India పుస్తకంలో ముస్లిములు, దేశవిభజనపై వెలిబుచ్చిన అభిప్రాయాలు పూర్తిగా అకడమిక్, డెమొక్రటిక్ గా సాగుతాయి తప్ప మతకోణం లోంచి కాదు. కొన్ని వాక్యాల ఉటంకింపులు ఇవి.

1. డా. అంబేడ్కర్ భారతదేశ విభజనను సమర్థించారా?

కొన్ని షరతులకు లోబడి సమర్థించారు. ముస్లింలు పాకిస్తాన్ కావాలని నిశ్చయించుకుంటే, దేశరక్షణ, భద్రత కొరకు విభజనను అంగీకరించాలని డా. అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. బలవంతపు ఐక్యత ప్రమాదకరమని అన్నారు. అది స్కాలర్లీ అకడమిక్ అభిప్రాయం తప్ప, మతోన్మాదంతో జిన్నా సావార్కర్ ల ద్విజాతి సిద్ధాంతానికి సమర్థింపుగా కాదు.

* ముస్లిములు పాకిస్తాన్ కావాలని గట్టిగా పట్టుబడితే, దానిని వారికి ఇవ్వాల్సిందే అని నేను గట్టిగా నమ్ముతున్నాను." పే. 363

* “ముస్లిం ఇండియా మరియు ముస్లిమేతర ఇండియాగా భారతదేశాన్ని విభజించడం అనేది రక్షణ పరంగా ఇరువురికి క్షేమదాయకం అని భావిస్తున్నాను." పే.367 (non muslim India అంటారు తప్ప హిందూ ఇండియా అనలేదు)

* "పాకిస్తాన్ అనేది ఒక సమస్యగా అనుకొన్నప్పుడు, తప్పించుకోవడానికి మార్గం కనిపించదు, దానికి పరిష్కారం కనుగొనబడాలి అని నమ్మేవారిలో నేను ఒకడిని." పే. 385

.

2. అంబేద్కర్ భారతదేశ ద్వి-జాతి సిద్ధాంతాన్ని (Two-Nation Theory) సమర్థించారా?

ముస్లింలు తమను తాము ఒక ప్రత్యేక జాతిగా చెప్పుకోవడాన్ని అంగీకరించారు. హిందువులతో కలిసి జీవించటం అనేది వారి సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తుందని నమ్మటం వలన వారు రాజకీయంగా సాంస్కృతికంగా ఒక జాతిగా అర్హత పొందారని డా. అంబేద్కర్ భావించారు.

* "ముస్లింలు 'ఒక జాతిగా జీవించాలనే సంకల్పాన్ని' పెంపొందించుకున్నారు. వారు కెనడాలో ఫ్రెంచివారిలాగో, సౌత్ ఆఫ్రికాలో ఇంగ్లీషువారిలాగో (ద్వితీయపౌరులుగా) బతకటానికి ఇష్టపడటం లేదు. వారు మాకంటూ ఒక దేశం కావాలని కోరుకొంటున్నారు. పే.39

* "మిగిలిన వారి కంటే భిన్నంగా ఉండి, ఇతరులు అంగీకరించిన దానిని తాము అంగీకరించడానికి నిరాకరించే ప్రజలు ఒక జాతి అవుతారు." పే.336. ఆ విధంగా ముస్లిములు వేరే జాతి అని అంటున్నారు.

3. .డా. అంబేద్కర్ ముస్లింలను భారతదేశం విడిచి వెళ్ళమని అడిగారా?

పాకిస్తాన్ అంటూ ఏర్పడితే, మైనారిటీల బదిలీ (ముస్లింలు పాకిస్తాన్‌కు, హిందువులు/సిక్కులు ఇండియాకు) "ఏకైక శాశ్వత పరిష్కారం" అని డా. అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.
అయినప్పటికీ ఈ బదిలీలు "స్వచ్ఛందంగా" ఉండాలని వాదించారు. ఎవరినీ బలవంతంగా ఒకచోటి నుండి మరొక చోటుకి పంపటాన్ని డా. అంబేద్కర్ అంగీకరించలేదు.

* పాకిస్థాన్, ఇండియాలు తమ తమ ప్రాంతాలలో నివసిస్తున్న మైనారిటీలకు తాము వలసకు వెళ్లాలా వద్దా అనే ఐచ్ఛికతను ఇవ్వాలి. పే. 381
* బదిలీని బలవంతం చేయకూడదు, మేము వలసవెళతామని ప్రకటించిన వారికి మాత్రమే ఆ అవకాశం ఇవ్వాలని నేను భావిస్తున్నాను. పే. 382
డా. అంబేద్కర్ ముస్లిములు, దేశవిభజనపై చెప్పిన అభిప్రాయాలన్నీ స్కాలర్లీ అకడమిక్ అభిప్రాయాలు. అవి శాస్త్రీయంగా ఆనాటి జాతీయ అంతర్జాతీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని చేసిన రిమార్కులు.

డా. అంబేద్కర్ ముస్లిములపై వెలిబుచ్చిన అభిప్రాయాలన్నీ విభజనపూర్వమైనవి. అప్పటికి 600 ఏళ్ల పాలకులుగా ముస్లిములు భారతదేశంలోనే ఉన్నారు. విభజనానంతరం ఇక్కడే మిగిలిపోయిన ముస్లిముల పట్ల డా. అంబేద్కర్ సహానుభూతితో ఉన్నారు.

విషవాదులు డా. అంబేద్కర్ విభజనపూర్వ వాదనలను తెలివిగా ముందుకు తెస్తారు, ఆయనపై బురదచల్లడానికి. ఇది దుర్బుద్ధి.

విభజన పూర్వ అంబేద్కర్ అభిప్రాయాలు ప్రత్యేక స్థల కాలాదులకు లోబడి చేసినవి అని గ్రహించాలి.

ఈ విచక్షణ ద్వేషవాదులకు ఉండదు.

November 28, 2025

సార్వత్రిక ఓటుహక్కు ఎలా వచ్చింది?

బ్రిటిష్ పాలనలో భారతీయుల స్వయంపాలనకొరకు పరిమిత ఓటుహక్కుతో ఎన్నికలు జరిగేవి. 1919 లో ప్రొవెన్షియల్, కేంద్ర శాసనసభ్యుల కొరకు జరిగిన ఎన్నికలలో - ఆస్తిపన్ను, ఆదాయపన్ను చెల్లించేవారికి, కొద్దోగొప్పో విద్యార్హత కలిగి ఉన్నవారికి మాత్రమే ఓటు హక్కు ఉండేది.

1921 లో మోతిలాల్ నెహ్రూ అధ్యక్షుడు, జవహర్ లాల్ నెహ్రూ సెక్రటరీగా పాట్నాలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఏ కొద్దిమందికో కాక భారతదేశ ప్రజలందరకూ ఓటుహక్కు (Universal Adult Saffrage) కల్పించాలని తీర్మానం చేసారు. దీన్ని "నెహ్రూ రిపోర్టు" అంటారు.

మహాత్మ గాంధి తన Young India పత్రికలో సార్వత్రిక ఓటుహక్కును ఇలా సమర్ధించారు.

"డబ్బు ఉన్న మనిషికి ఓటు హక్కు ఇచ్చి, సంపద లేదా అక్షరాస్యత లేని మనిషికి ఓటు హక్కు ఇవ్వకపోవడం నేను ఎంతమాత్రం సహించలేను. ప్రతిరోజూ కష్టపడి నిజాయితీగా పనిచేసే మనిషికి, కేవలం పేదవాడు అయిన 'నేరం' కారణంగా ఓటు హక్కు ఉండకూడదు అనే ఆలోచనను నేను అంగీకరించలేను."- మహాత్మా గాంధి (1931).

1935 లో నెహ్రు అధ్యక్ష్యతన జరిగిన లక్నో అఖిలభారత కాంగ్రెస్ మహాసభలలో "సార్వత్రిక వయోజన ఓటు హక్కు ద్వారా రాజ్యాంగ పరిషత్ ఎన్నికలు జరగాలని" తీర్మానం చేసారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన రాజ్యాంగం మనం రాసుకొనే క్రమంలో 1946-1950 మధ్యలో జరిగిన constituent Assembly Debates లో కమిటీ సభ్యులు జాతి, కులం, ధనం, మతం, లింగ భేదం లేకుండా - ప్రతి వయోజనుడికి ఓటు హక్కు కల్పించాలి అని దాదాపు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఈ సందర్భంగా- సార్వత్రిక ఓటుహక్కు ఆధారంగా ఎన్నికలు జరగాలని కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తూన్నదని జవహర్ లాల్ నెహ్రూ గుర్తుచేసారు. చారిత్రకంగా అణగారిన వర్గాలను శక్తివంతం చేయడానికి సార్వత్రిక ఓటుహక్కు తప్పనిసరి అని డా. అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

డా. అంబేద్కర్, నెహ్రూ, శ్రీ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, శ్రీ వి మునిస్వామి పిళ్లై లాంటి దార్శనికులు రాజ్యాంగ నిర్మాణ సమయంలో 21 సంవత్సరములు నిండిన ప్రతి భారతీయునికి ఓటుహక్కు కల్పించటం ద్వారా ఈ దేశ నిర్మాణంలో సామాన్యుడు కూడా పాలుపంచుకొనే అవకాశం కల్పించారు.

***

స్వతంత్రభారతదేశ భవిష్యత్తును దేశప్రజల భాగస్వామ్యంతో తీర్చిదిద్దటంలో ఆనాటి దార్శనికులు కృషిచేస్తూండగా.... మరో వైపు ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించటాన్ని ఆనాటి సనాతనవాదులు తీవ్రంగా విమర్శించారు.

రాజ్యాంగ సార్వత్రిక ఓటుహక్కు కల్పించిన సందర్భంలో శ్రీ గోల్వాల్కర్ ఒక సభలో ప్రసంగిస్తూ "అందరికీ ఓటు హక్కు కల్పించటం అంటే కుక్కలు పిల్లులకు హక్కులు ఇవ్వడం కంటే మరేమీ కాదు" అని వ్యాఖ్యానించాడు. (రి. Critical analysis of Rastriya Swayamsevak Sangh by Govind Sahai, ex chief parliamentary secy. pn. 39)

గోల్వాల్కర్ దృష్టిలో ముస్లిములు, క్రిష్టియనులు, కమ్యూనిష్టులు లోపలి శత్రువులు. అదే విధంగా వర్ణవ్యవస్థ ద్వారా దళితబహుజనులను దూరంపెట్టే

మనుస్మృతిని రచించిన మనువును మానవాళికి గొప్ప శాసనకర్తగా అభివర్ణిస్తాడు. ఇలాంటి అభిప్రాయాలున్న వ్యక్తి కుక్కలు పిల్లులకు హక్కులు కల్పించారు అనటంలో- ఆ కుక్కలు పిల్లులు ముస్లిములు, క్రిష్టియనులు, కమ్యూనిష్టులు, అవర్ణులు అని సులభంగానే పోల్చుకోవచ్చు.

సాటి మనిషిని కుక్కలు పిల్లులుగా చూసే సంస్కృతి మనువాదులది.

ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్ January 7, 1952 సంచికలో సార్వత్రిక ఓటుహక్కు ను ఎద్దేవా చేస్తూ "భారతదేశంలో సార్వత్రిక వయోజన ఓటు హక్కు (universal adult franchise) విఫలమైందని పండిట్ నెహ్రూ స్వయంగా ఒప్పుకునే వరకు జీవించే ఉంటారు" అని వ్యాఖ్యానించింది. (Reference: India After Gandhi: The History of the World's Largest Democracy By Ramachandra Guha pn 157)

ఈ అభిప్రాయం, కొత్తగా ఓటు హక్కు పొందిన, నిరక్షరాస్యులైన భారతీయ ప్రజల సామర్థ్యాన్ని వెటకరిస్తుంది. వయోజనులందరకీ ఓటుహక్కును ఇవ్వటం లోని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంది.

ప్రజలందరూ సమానంకాదు, ఎక్కువతక్కువలుగా విభజింపబడి ఉన్నారని చెప్పిన మనుస్మృతి సూత్రాలను తిరస్కరించి ప్రజలందరూ సమానమే అని చెప్పింది రాజ్యాంగం. అది కల్పించిన సార్వత్రిక ఓటుహక్కును మనువాదులు విమర్శించిన తీరు ఇది.

దీని వెనుక ఉద్దేశాలు స్పష్టమే. వేల సంవత్సరాలుగా సమాజపు నెత్తిపై కూర్చుని అందరిపై సాగించిన పెత్తనం ఇంకా కొనసాగించాలని.

***

ఈ రోజు విచ్చలవిడిగా జరుపుతోన్న తొలగింపుకు మూలాలు ఇక్కడ ఉన్నాయి. శ్రీ గోల్వాల్కర్ చెప్పినట్లు కుక్కలకు పిల్లులకు ఓట్లు ఇచ్చి పక్కన కూర్చోబెట్టుకోవటం అభ్యంతరకరం. .... పిర్రలు కోయాలి.... ఏ కాలంలోనైనా....

November 28, 2025

"మహర్షి అంబేద్కర్" - శ్రీ గుర్రం ధర్మోజీ గారి పుస్తక పరిచయం

భారతదేశపు రాజకీయ చిత్రాన్ని, సామాజిక వ్యవస్థను ఒక జ్ఞాన సూర్యునిలా ప్రకాశింపచేసిన అజరామరుడు, ప్రాతఃస్మరణీయుడు డా. బి.ఆర్. అంబేద్కర్. అలాంటి మహానుభావుని జీవితచరిత్రను "మహర్షి అంబేద్కర్" అనే పేరుతో గేయకావ్యాన్ని వెలువరించారు ప్రముఖ పద్యకవి శ్రీ గుర్రం ధర్మోజీ గారు.

శ్రీ గుర్రం ధర్మోజీ సంస్కృతాంధ్ర భాషలలో అనేక రచనలు చేసిన ప్రముఖ పద్యకవి. తెలుగులో అనేక ఉదాహరణ కావ్యాలు (ప్రత్యేకమైన చందోరీతి) రచించిన పండితుడు. "మహర్షి అంబేద్కర్" కావ్యంలో అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన 275 పద్యాలు ఉన్నాయి. ఇవి చక్కని నడకతో, మాత్రా చందస్సులో ఉంటూ అంబేద్కర్ మహాశయుని జీవితంలోని వివిధ అంశాలను గొప్పగా దృశ్యమానం చేస్తాయి.
డా. బి.ఆర్. అంబేద్కర్ జీవితచరిత్రను డా. బోయి భీమన్న, శ్రీ దాసి బసవయ్య, మొదలగు మహాత్తమ పండితులు మనకు వచనంలో అందించారు. (శ్రీ గుర్రం ధర్మోజీ గారు కూడా ఇదివరలో సంస్కృత శ్లోకాలలో అంబేద్కర్ సుప్రభాతం రచించారు).

"మహర్షి అంబేద్కర్" రచన పాడటానికి లయబద్ధంగా, సరళంగా గేయరూపంలో ఉంటుంది. గేయాల్లో కనిపించే చక్కని పదపాహళింపు, లయ, సందర్భోచితంగా పరిమళించే కవిత్వపు సుగంధాలు చకితుల్ని చేస్తాయి. పఠితులను ఆలోచింపచేసి చైతన్య పరుస్తాయి.

డా. బి.ఆర్. అంబేద్కర్ జననాన్ని చిన్న చిన్న పదాలతో వర్ణించే పద్యాలు ఇవి. వీటిలో అంబేద్కర్ ను భారతదేశ జ్ఞాన తిలకంగా, ఒక ఉదయించే సూర్యునిగా అభివర్ణించటం వారు జీవితపర్యంతం నెరపిన సేవకు, తగిన స్థానం కల్పించటంగా అర్థం చేసుకోవాలి. చిక్కని చీకట్లు చీల్చటం అన్నప్రయోగం భావస్ఫోరకం.

విశాల భారతదేశపు
లలాట ఫలకస్థలాన
చలిత ప్రభాకలితము
జ్వలిత జ్ఞానతిలకము
బానిసత్వ బ్రతుకులందు
చిక్కని చీకట్లు చీల్చ
మహర్లందు మహర్షిగా
అంబేద్కర్ ఉదయించెను.



స్కూల్లో లెక్కల మాస్టారు ఇచ్చిన ఒక లెక్కకు విద్యార్థులు జవాబు చెప్పలేనప్పుడు, తరగతి గది బయట ఉన్న అంబేద్కర్ దానికి సమాధానం ఇవ్వటానికి ముందుకొచ్చిన సందర్భంలో ధర్మోజీ గారు చెప్పిన ఈ పద్యం లోని పదాల నడక, పోతన 'అడిగెదనని కడువిడుజను' ... పద్యానికేమీ తీసిపోదు.

ఉత్త 'రా'కుమారులట్టులవారలు
ఉత్తరమీయకతత్తరపాటున
బిత్తరపోవుచునిస్సహాయులై
నిరుత్తరులౌచునిలుచుంటే (ఇది గేయ పద్యం, చందో బద్ధం కాదు గమనించగలరు)

ఆతను అంటరానివాడు లోనికెట్లా వచ్చెదడని తోటి విద్యార్థులు అభ్యంతరం పెట్టగా, బాల అంబేద్కర్ మనసులో చెలరేగిన ఆలోచనలు, తగిలిన గాయం ఎలా ఓ గేయంగా మారిందో చూడండి

నేనే? పాపం చేశాననుచు
చిన్నమనస్సునెన్నో ప్రశ్నలు
మెదడును తొలిచే పదునగుబాకులు
నెమ్మనమున ఉమ్మెత్తలగుత్తులు.

మొత్తం పద్యం బరువు అంతా పదునగుబాకులు, (తరువాతకాలంలో జాషువాగారిని గుచ్చిన బాకులే), ఉమ్మెత్తలగుత్తులు అన్న పదాల వద్ద ఉంది. ఆ బాకులు శరీరానికి తగిలినవి కాదు, మెదడుకి తగిలాయట. మనసున ఉమ్మెత్తలగుత్తులు మొలచాయట. ఎంత గొప్ప సందర్భోచిత ప్రయోగాలివి.

ఈ రోజు అసంఖ్యాక దళిత, బహుజన యువత అంబేద్కరిజం తమకు ఆదర్శమని ప్రకటించుకొంటున్నది. ఎందుకు అంటే కారణం ఈ చిన్ని పద్యంలో కనిపిస్తుంది

తనేకదా దళితులకు తలపు
తనేకదా పోరునకు పిలుపు
తనేకదా ఉద్యమపు గెలుపు
గుండెలలో సదా నిలుపు

దళితబహుజనేతరలకు కూడా అంబేద్కర్ ఆదర్శనీయుడే ఎందుకంటే ఈ రోజు ఆయన ఉపన్యాసాలను చదివితే, అంబేద్కర్ యొక్క రాజనీతిజ్ఞత, నిబద్ధత, తర్కం, ముక్కుసూటిదనం, పోరాటపటిమ, సహనశీలత వంటి ఉదాత్త లక్షణాలెన్నో ఆశ్చర్యం కలిగించకమానవు. ఒక్క మనిషి ఇన్ని కోణాల్లో, అంతటి వ్యతిరేకతలో తన వ్యక్తిత్వాన్ని, భావజాలాన్ని ఎలా నిలుపుకోగలిగాడా, చివరివరకూ ఎలా కొనసాగించగలిగాడా అని ప్రస్తుతతరమే కాదు భావితరాలు కూడా చేతులుజోడించి నమస్కరించే మూర్తిమత్వం అంబేద్కర్ ది.

అలాంటి అంబేద్కర్ ఉపన్యాసం పై ధర్మోజీ గారు గొప్ప పద్యాలు వ్రాసారు

ఉపన్యాసమన ఉపన్యాసమా?
అంబేద్కరుని ఉపన్యాసము
అద్భుతమైన విన్యాసము
అచ్చెరువొందే ఉపన్యాసము
మాటలు కావవి మంటలు కాని
మాటలు కావవి ఈటెలు కాని
పదములు కావవి పదును కత్తులు
గాధకాదని బాధయెకాని

డా. బి.ఆర్. అంబేద్కర్ బాల్యము, అమెరికా లండన్ లలో ఆయన విద్యాభ్యాసము, మహద్ ఉదంతం, సైమన్ కమిషన్ ఎదుట వాదనలు, రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రాతినిధ్యం, బౌద్ధమతస్వీకరణ, హిందూకోడ్ తిరస్కరణకు నిరసనగా రాజీనామా, రమాభాయి నిష్క్రమణ, రాజ్యాంగనిర్మాణం, మహాభినిష్క్రమణం వంటి అనేక అంశాలతో "మహర్షి అంబేద్కర్" పుస్తకం ఎంతో ఆసక్తికరంగా ఆ మహాశయుని సంపూర్ణ జీవితాన్ని మనకనుల ముందు నిలుపుతుంది.

డా. బి.ఆర్. అంబేద్కర్ 125 జయంతోత్సవాల సందర్భంగా వెలువరించిన ఈ పుస్తకం ఒక చక్కని స్మరణ, నివాళి.

ప్రతిఒక్కరు చదివి ప్రేరణనొంది, మరో పదిమందికి ఈ పుస్తకాన్ని బహూకరించి వారిలో కూడా ఉత్తేజాన్ని నింపాల్సిన సమయం ఇది.

శ్రీశ్రీ బుద్ధమతావలంబసహితం, శ్రీభీమరాయం శుభం
శ్రీశ్రీ జ్ఞానవిధాన భాస్కరసమం శ్రీబాబసాహేబునం
శ్రీ సక్పాలసుతంనమామిసతతంసాంబేద్కరం భాసురం

భీమాబాయిసుతం సదా హితకరం శ్రీబుద్ధ ధర్మాశ్రితం ..... అంటూ శ్రీ ధర్మోజి అంబేద్కర్ పై వ్రాసిన సంస్కృత శ్లోకంతో ఈ గేయసంపుటి మొదలై, మరో సంస్కృత మంగళాశాసనంతో ముగుస్తుంది.

****

రచయిత గురించి

పేరు: గుర్రం ధర్మోజి (కీ.శే)

రచనలు: శ్రీ అంబేద్కర్ సుప్రభాతం (సంస్కృతం), శ్రీ భీమరాయ ప్రభాత గీతి (గేయం), శ్రీ భీమరాయ ఉదాహరణ కావ్యం, ఆంధ్రకేసరి ఉదాహరణ కావ్యం, క్రీస్తు సుప్రభాతం (సంస్కృతం), అయ్యప్ప సుప్రభాతం (సంస్కృతం), నాన్న (గేయకావ్యం), మహర్షి అంబేద్కర్ (గేయ కావ్యం)

వృత్తి: తెలుగు లెక్చరర్, రాజోలు డిగ్రీ కళాశాల

April 13, 2016

ఎలుగెత్తి చాటుదాం

ఎలుగెత్తి చాటుదాం
ఎలుగెత్తి చాటుదాం అందరం
అంబేద్కరు ఒక అస్తమించని సూర్యుడని
అసంఖ్యాక హృదయాలలో
నిత్యం ప్రకాశించే మార్తాండ తేజుడని

చదువు సమీకరించు పోరాడు అన్న మూడు పదాలలో
మన జీవితాలకు దిశానిర్ధేశనం చేసిన
ఆధునిక బోధి సత్వుడని
వీధి కుళాయి నీళ్ళు తాగనివ్వని వివక్షా తిమిరంతో
జ్ఞానమనే కాంతిఖడ్గంతో సమరం చేసిన
అవిశ్రాంత యోధుడనీ, అలుపెరుగని ధీరుడనీ
"మేం హరిజనులమైతే మీరంతా దెయ్యం బిడ్డలా" అని ప్రశ్నించి
పోరాటాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాన్ని
ముక్కుసూటిగా ఎదుర్కొన్న ధీశాలి అని

ఎలుగెత్తి చాటుదాం అందరం
అంబేద్కరు ఒక అస్తమించని సూర్యుడని
ఎన్ని యుగాలైనా కొండెక్కని పరిమళ దీపమని
మనుస్మృతిలోని నిచ్చెనమెట్లని మొదటగా గుర్తించి దాన్ని
తగలెయ్యమని పిలుపునిచ్చిన గొప్ప సామాజిక శాస్త్రవేత్త అని
హిందూ భావజాలాన్ని ఒక చారిత్రాత్మక మలుపుతిప్పిన చరితార్ధుడని
దేశంలో సగభాగానికి సమానహక్కులు
పోరాడి సాధించిపెట్టిన గొప్ప మానవతా వాది అని
దేశ మహిళలందరకూ ప్రాతఃస్మరణీయుడనీ
తన జాతిపై జరుగుతున్న అణచివేతను లండన్ సమావేశంలో

నిప్పులాంటి స్పష్టతతో ప్రపంచానికి ఎరుకపరచి
తన ప్రజకు ప్రత్యేక అస్థిత్వాన్ని సాధించిపెట్టిన రాజనీతిజ్ఞుడనీ
దీన జనోద్ధారకుడనీ

ఎలుగెత్తి చాటుదాం అందరం
అంబేద్కరు ఒక అస్తమించని సూర్యుడని
అంబేద్కరిజం అంటే ఆ మహనీయుని
వెన్నెముకతో చేసిన వజ్రాయుధమనీ
స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం అనే మూడు సింహాలను
భారత రాజ్యాంగంగా మలచి సామాన్యుడికి కాపలాగా పెట్టిన
అనితర సాధ్యుడనీ, అపార విద్యాపారంగతుడనీ
మానవజాతికి వన్నెతెచ్చిన మేధో శిఖరమని
ఈ శతాబ్దపు మూర్తీభవించిన జ్ఞాన స్వరూపమని
దళిత బహుజనుల జీవితాలలో నీలికాంతులతో వెలిగే ఆరంజ్యోతి అనీ

ఎలుగెత్తి చాటుదాం అందరం
అంబేద్కర్ అంటే ఆత్మవిశ్వాసమనీ
జై భీమ్ అంటే దారిచూపే చూపుడు వేలని
ఎలుగెత్తి చాటుదాం అందరం

(డా. బి.ఆర్. అంబేద్కర్ 125 వ జయంతి సందర్భంగా)

బొల్లోజు బాబా

April 14, 2017

